క్లుప్తంగా

30 నుంచి ఉచిత యోగా శిక్షణ

పెనమలూరు: ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్ర నిర్వాహకులు తెలిపారు. వారు శుక్రవారం వివరాలు తెలుపుతూ ఈ నెల 30వ తేదీన పెనమలూరు సెంటర్ కిలారు అనీల్ ఎస్టేట్‌లో ఉదయం 6 గంటలకు శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందని అన్నారు. ఇప్పటికే శిక్షణ పొంది పూర్తి చేసిన బ్యాచ్‌కు యోగా గురువు ఆతుకూరి వెంకటేశ్వరరావు గురూజీ వచ్చి అనుగ్రహ భాషణం చేస్తారని అన్నారు. యోగా శిక్షణ పొందాలనుకునే వారు 9133306804 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ఐదు అక్రమ కట్టడాలు కూల్చివేత



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో అక్రమ కట్టడాలను సీఆర్డీఏ అధికారులు శుక్రవారం కూల్చి వేశారు. గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఐదు అక్రమ కట్టడాలపై సీఆర్డీఏ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనికి సీఆర్డీఏ అధికారులు శ్యామ్ కుమార్, విక్కికుమార్, కిశోర్ మరో ఇద్దరు భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. భవన యజమానులు సరైన సమాధానం, అనుమతులు పొందిన పత్రాలు సమర్పించకపోవటంతో సీఆర్డీఏ అధికారులు ఐదు భవనాల అక్రమ కట్టడాలను కూల్చి వేశారు. అనుమతులు లేకుండా ఎవ్వరూ అక్రమ కట్టడాలు కట్టరాదని టీపీవో శివన్నారాయణ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్డీఏ, గ్రామ పంచాయతీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించాలని కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మునిసిపాలిటీ పరిధిలో ఉండే నివాసితులు అర్ధ సంవత్సరం ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు జూన్ 30వ తేదీ నాటికి చెల్లించాలన్నారు. ఇలా సకాలంలో చెల్లించే వారికి అపరాధ రుసుము విధించమని వివరించారు. 30వ తేదీ ఆదివారం కూడా పన్నులు కట్టించుకుంటామని, అలాగే www.cdma.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

పెనమలూరు పంచాయతీలో రికార్డుల తనిఖీ



పెనమలూరు: పెనమలూరు గ్రామ పంచాయతీ రికార్డులను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు కార్మికులు పని చేయక పోయినా నిధులు డ్రా చేశారని ఆరోపించారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్‌నాయక్ విచారణకు ఆదేశించారు. దీంతో గుడివాడ డీఎల్‌పీవో సంపత్‌కుమారి, పెనమలూరు ఈవోపీఆర్డీ సీతారామరాజు, చల్లపల్లి ఈవో నాగేంద్రరావు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. కాంట్రాక్టు కార్మికుల వివరాలు, హాజరు, జీతాల సొమ్ము చెల్లింపులు వివరాలు పరిశీలించారు. పంచాయతీ సర్పంచి లింగాల భాస్కరరావు, ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



గన్నవరం: క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని వీకేఆర్ కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి సూచించారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్లాలని చెప్పారు. దీనికోసం చదువుతో పాటు సాంకేతిక రంగాల్లో రాణించేలా స్వయంశక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్పొరేట్ కళాశాలలకు పోటీగా ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధనకు అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. కళాశాల కమిటీ కార్యదర్శి జీఎస్ఎల్ఎన్. ప్రసాద్, ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, అధ్యాపకుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రహదారులు ధ్వంసం

- ఖరీఫ్ పనులతో దమ్ము ట్రాక్టర్ల రాకపోకలు
- ఛిద్రమవుతున్న రహదారులు
- పట్టించుకోని అధికారులు



ఈడుపుగల్లు-ఉప్పలూరు రోడ్డుపై వెళ్తున్న దమ్ము ట్రాక్టర్

కంకిపాడు: ఖరీఫ్ సీజన్ ఊపందుకోవటంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పొలాలను దమ్ము చేయించి నాట్లకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ తరుణంలో దమ్ము ట్రాక్టర్లు యథేచ్ఛగా రోడ్లపై సంచరించటంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. నిబంధనలు పాటించకపోవటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 42 వేల ఎకరాల్లో సాగుకు అనువైన భూమి ఉంది. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ వరి నాట్లకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. మరో వైపు నాట్లు వేసేందుకు భూమిని దమ్ము చేస్తున్నారు. దీనికి గానూ దమ్ము ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. అయితే పలువురు ట్రాక్టర్ యజమానులు నిబంధనల ప్రకారం దమ్ము ట్రాక్టర్లకు ఇనుప పట్టాను ధరింప చేయాల్సి ఉన్నా పాటించటం లేదు. దీంతో దమ్ము చక్రాల కింద రోడ్లు ధ్వంసమైపోతున్నాయి. జాతీయ రహదారి, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్ ఇలా శాఖ ఏదైనా సరే దాని పరిధిలోని రహదారులు అన్ని చిత్తుగా మారుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా దమ్ము చక్రాలే.

వాహనదారుల పాట్లు..

అధ్వానంగా మారుతున్న రహదారులపై రాకపోకలు సాగించలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్జిన్‌లు కోతకు గురై ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రధానంగా రాత్రిళ్లు ప్రయాణం అంటే హడలెత్తిపోతున్నారు. ఇనుప పట్టా ధరించకుండా కొన్ని ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతున్నా, దాని వల్ల రహదారులు ధ్వంసం అవుతున్నా అధికారులు ఆ వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. నిబంధనలు పాటించేలా అధికారులు రైతుల్లో అవగాహన పెంపొందించేలా చేస్తే రోడ్ల ధ్వంసాన్ని అరికట్టవచ్చని ప్రజలు సూచిస్తున్నారు.

నూతన భవనాలు ప్రారంభం



చోడవరంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్

పెనమలూరు: మండల పరిధిలో చోడవరం, గోసాల గ్రామాలలో రెండు నూతన భవనాలను ఎమ్మెల్యే బోడెప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. చోడవరం గ్రామంలో ఈబీసీ కాలనీలో రూ. 25 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. అదే విధంగా గోసాల వైకుంఠపురంలో రూ. 15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రసాద్ ప్రారంభించారు. ఉపాధి నిధులు, మండల పరిషత్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నిధులతో ఈ భవనం నిర్మించారు. కార్యక్రమంలో చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం, ఎంపీడీఓ కుమార్‌బాబు, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాంచారయ్య, హౌసింగ్ ఏఈ జిలాని, విద్యుత్ శాఖ ఏఈ ఆర్.సూర్యనారాయణ, పంచాయతీ ఉపసర్పంచి సాంబశివరావు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలైతే జీవితం అంధకారం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్



మాట్లాడుతున్న వికాస్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలయితే వారి కలలు కల్లలు అవుతాయని స్పార్క్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ భావిశెట్టి రమేష్ అన్నారు. యాంటి డ్రగ్ డేను పురస్కరించుకొని నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నందు శుక్రవారం స్పార్క్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. సైకాలజిస్టులు శ్రావణి, రమాదేవి, శ్రీదేవి, పద్మావతి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. డ్రగ్ తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి, అసిస్టెంట్ శ్రీరవిప్రసాద్, అనిశెట్టి నళినిరామ్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలి

నున్న(విజయవాడరూరల్): మాదకద్రవ్యాల పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని వికాస్ గ్రూప్ సంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాలతో పాటు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్స్ సహకారంతో మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహించారు. కార్యక్రమంలో వికాస్ గ్రూఫ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్, నవజీవన్ బాలభవన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులన్నీ సక్రమమే

స్టేట్ రీసోర్సు పర్సన్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న స్టేట్ రీసోర్సు పర్సన్ సూర్యనారాయణ

నున్న(విజయవాడరూరల్): గత ఏడాది అంటే 2023ఏప్రిల్ నుంచి 2024మార్చి వరకు నున్న గ్రామంలో జాతీయ ఉపాధి పథకం కింద జరిగిన పనులు సక్రమంగా జరిగినట్టుగా సోషల్ ఆడిట్ బృందం పేర్కొంది. సామాజిక తనిఖీ బృందం శుక్రవారం సచివాలయం-2 వద్ద నిర్వహించిన గ్రామసభలో స్టేట్ రీసోర్సు పర్సన్ సూర్యనారాయణ మాట్లాడుతూ గడచిన సంవత్సర కాలంలో నున్న గ్రామంలో కోటి 40లక్షల రూపాయల విలువగల 521 పనులు జరిగాయన్నారు. వాటిలో మెటీరియల్ కంపొనెంట్ కింద 5లక్షల71వేల రూపాయలు ఖర్చు చేయగా కోటి 45లక్షల రూపాయల పనులు నిర్వహించారన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ గ్రాంటుతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, హెల్త్‌సెంటర్లు, ఆర్‌బీకే భవనాల నిర్మాణాలతో పాటు పేదల గృహనిర్మాణాలకు ఖర్చు చేసిందన్నారు. రైతుల పొలాల్లో నీటి కుంటల తవ్వకం, సరిహద్దులు ట్రంచ్‌ల పనులు, పంట కాల్వల తవ్వకం పనులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామంలో 1894 మంది లబ్ధిదారులకు పెన్షన్లు ప్రతి నెలా అందుతున్నాయన్నారు.

మస్టర్లు నమోదు సక్రమంగా లేవు..

నున్న గ్రామంలో ఉపాధికూలీల మస్టర్లు సక్రమంగా నమోదు జరగలేదని సత్యనారాయణ తెలిపారు. 1375 మస్టర్లకు గాను 721 మస్టర్లు చెక్ చేయలేదని, ఫీల్డ్ అసిస్టెంటు వల్ల ఇలాంటివి జరిగినవిగా గుర్తించామన్నారు. కూలీలకు మస్టర్లు వేసి వాటిని కొట్టివేతలుగా రిజిస్టర్లో ఉన్నాయని, అయితే కూలీలకు వేతనాలు కూడా చెల్లింపులు జరిగినట్టు ఉందన్నారు. ఆ మొత్తాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రికవరీ చేయాల్సి ఉంటుందన్నారు. పనులపై కూలీలకు అవగాహన కల్గించే కార్యక్రమాలు నిర్వహించలేదని, పనిచేసే ప్రాంతంలో కూలీలకు సదుపాయాలు కల్పించినట్లుగా నిర్ధారణ కాలేదన్నారు. గ్రామ ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో పంచాయతీ వార్డు సభ్యులు యర్కారెడ్డి వెంకటరెడ్డి, కాటూరి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాసరావు, బొట్టా అరుణ,దాసరి కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, గ్రామ కార్యదర్శి జీటీబీ రమణ పాల్గొన్నారు.

స్వర్ణభారత్‌లో ఉచిత హోమియో వైద్య శిబిరం

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జీవీ చలపతిరావు మెమోరియల్ సెల్ఫ్ రిలయన్స్ హోమియో ఫోరం (బెంగళూరు) ఆధ్వర్యంలో ఈ నెల 30నుంచి ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ హోమియో వైద్యుడు పీవీ సత్యనారాయణ నాలుగు రోజులపాటు ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి నాలుగు రోజులు ట్రస్ట్ ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడ్కో ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారులకు డిపాజిట్ చెల్లింపు

ఉయ్యూరు: ఉయ్యూరు మునిసిపాలిటీ పరిధిలో టిడ్కో గృహాలు మంజూరు కాని లబ్ధిదారులకు డిపాజిట్ తిరిగి చెల్లించనున్నట్లు కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఏర్పాటుచేసిన డిపాజిట్ల చెల్లింపును చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చెక్కులను అందిస్తారన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

గోమాతకు సీమంతం



ఉయ్యూరు: శ్రీ జగదాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో గోమాతకు సీమంతం వేడుక శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శివాలయంలోని గోశాలలో ఉన్న ఒంగోలు జాతి ఆవు గర్భం దాల్చి ఏడో నెల రావటంతో ఆలయ అధికారులు, అర్చక బృందం, పట్టణ వాసులు పూజా కార్యక్రమాలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా సీమంతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం పఠించారు.

వాడీవేడిగా పంచాయతీ పాలకవర్గ సమావేశం



పైపులైన్‌ను పరిశీలిస్తున్న పాలకవర్గ సభ్యులు

గన్నవరం: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సాధరణ సమావేశం వాడీవేడిగా జరిగింది. తాగునీటి కనెక్షన్లు, కార్మికులకు అకారణంగా తొలగించడం, ఇతర బిల్లులు చెల్లింపులు తదితర అంశాలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. తొలుత సర్పంచి నిడమర్తి సౌజన్య అధ్యక్షతన పాలకవర్గ సమావేశం ప్రారంభమైంది. అయితే పంచాయతీ కార్యాలయంతో పాటు నాలుగు గ్రామసచివాలయాల్లో సీఎం చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలు ఏర్పాటు చేయక పోవడంపై టీడీపీ సభ్యులు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీఎస్ పురం కాలనీ రోడ్డులో నూతనంగా నిర్మించిన అయోధ్య అపార్ట్‌మెంట్స్‌కు తాగునీటి సరఫరాపై ఉపసర్పంచి పాలడుగు నానితో పాటు పలువురు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాలకవర్గం నిర్ణయం మేరకు సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు. అనంతరం స్థానిక కోనాయి చెరువు వద్ద అయోధ్య అపార్ట్‌మెంట్‌కు తాగునీటి సరఫరా నిమిత్తం ఏర్పాటు చేసిన పైపులైన్‌ను పరిశీలించారు. దీనిపై పాలకవర్గం తీవ్రంగా వ్యతిరేకించడంతో అపార్ట్‌మెంట్స్ పైపులైన్‌ను తొలగించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీఓ సత్యకుమార్, ఈఓ సీహెచ్ అనిల్‌కుమార్, పలువురు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఓపెన్ జిమ్



గ్రౌండ్‌లో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఎంపీ వల్లభనేని బాలశౌరి ఓపెన్ జిమ్‌కు రూ. 7 లక్షల ఎంపీ నిధులు కేటాయించారు. ఈ మేరకు ఎన్నికల ముందు ఓపెన్ జిమ్ పరికరాలు ఇక్కడికి చేరుకున్నప్పటికీ ఎలక్షన్ కోడ్ వల్ల పనులు జరగలేదు. అయితే కోడ్ ముగిసిన తర్వాత సదరు కాంట్రాక్టర్ ఓపెన్ జిమ్ పరికరాలను క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాకర్స్ అసోసియేషన్ ఆర్థిక సౌజన్యంతో ఓపెన్ జిమ్ ప్రాంగణంలో ప్లాట్‌ఫామ్ నిర్మాణం, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు కూడా ముగింపు దశకు చేరుకున్నాయని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ తెలిపారు. త్వరలో ఎంపీ బాలశౌరి చేతుల మీదుగా ప్రారంభోత్సం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉపాధ్యాయులందరూ కలిసి సంఘటిత శక్తిగా ఏర్పడి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత శక్తిని పెంపొందించాలని సీబీఎస్ఈ బోర్డు రీజనల్ ఆఫీసర్ శేఖర్ చంద్ర చెప్పారు. సీబీఎస్ఈ ఆధ్వర్యంలో బాలవాటిక, జాదూయి పిటారా కార్యక్రమాలపై అవగాహన సదస్సు పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో శుక్రవారం జరిగింది. శేఖర్ చంద్ర హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా పాఠశాలల్లోని ప్రీ కేజీ, నర్సరీ పేర్లను తొలగించి బాలవాటిక-1, బాలవాటిక-2 పేర్లతో పిలవాలని ఆదేశించారన్నారు. పిల్లల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించడానికి ఉపాధ్యాయులు పుస్తకాల్లోని పాఠ్యాంశాలను బోధించడంతో పాటుగా డిజిటల్ రూపంలో పాఠాలు చెప్పడం, కొండపల్లి బొమ్మలు, తోలు బొమ్మల ద్వారా విద్యార్థులకు పాఠాలు చెప్పడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు ఆహ్లాదంగా ఉండటంతో పాటుగా వారిలో ఉత్సుకత పెరిగి పాఠాలపై ఆసక్తి కనబరుస్తారన్నారు.

డ్రాయింగ్‌పై ఆసక్తి కనబరిచేలా..

సీబీఎస్ఈ సీఈవో అరుణా వెంకటేశన్ మాట్లాడుతూ.. కొండపల్లి బొమ్మలు, తోలు బొమ్మలు ఇలా బొమ్మల రూపంలో విద్యార్థులకు పాఠాలు బోధించేందు ఉపయోగించే పెట్టెను జాదూయి పిటారా అంటారని తెలిపారు. చిత్రలేఖనం ద్వారా పిల్లల్లో ఉన్న సృజనాత్మకశక్తి పెరుగుతుందని అందువల్ల ఉపాధ్యాయులు విద్యార్థులను డ్రాయింగ్‌పై ఆసక్తి కనబరిచేలా చూడాలన్నారు. ఈ అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కోసం ఈ సదస్సు ఏర్పాటు చేశామని చెప్పారు. రిసోర్స్ పర్సన్లు సుధారాణి, భారతి, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య, నగరంలోని సీబీఎస్ఈ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

గంగరాజు కళావేదికపై శీతకన్ను

- నిర్వాహకుల నిర్లక్ష్యం.. కళాకారుల పాలిట శాపం
- కళాహీనంగా మారిన దుస్థితి



గోకరాజు లైలా గంగరాజు కళావేదిక



నిరుపయోగంగా ఉన్న సామగ్రి

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల అనుబంధంగా దాత గోకరాజు గంగరాజు సహకారంతో నిర్మించిన కళావేదికపై నిర్వాహకులు శీతకన్ను వేశారు. దీంతో కళావేదిక అభివృద్ధి ఆమడ దూరంలో ఉంది. 20 ఏళ్ల క్రితం కళావేదిక నిర్మించారు. కళాశాల నిర్వాహకుల నిర్లక్ష్యం, భాషా సాంస్కృతిక శాఖ అధికారుల అలసత్వంతో కళావేదిక కళాహీనమై పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది.

గతమే ఘనం.. భవిష్యత్ శూన్యం

నగరంలోని కళాకారుల అవసరాలు తీర్చడానికి నగరానికి చెందిన సంగీత విద్వాంసులు, నృత్య కళాకారుల సమన్వయంతో పారిశ్రామికవేత్త లైలా గ్రూప్ అధినేత గోకరాజు గంగరాజు సహకారంతో గోకరాజు లైలా గంగరాజు కళావేదికను నిర్మించారు. 17-1-2003 ప్రముఖ గాయకుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ వేదికతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. నాటి ప్రముఖ విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, పీబీ శ్రీనివాస్, పి.సుశీల, శోభారాజ్, శోభానాయుడు, ఎస్.జానకి వంటి విద్వాంసులు ఇక్కడ కచేరీలు నిర్వహించారు. దాదాపు 20 ఏళ్ల పాటు సద్గురు సంగీత సభ, శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి, సంగీత సన్మండలి లాంటి సంస్థలు వేలాది కార్యక్రమాలను నిర్వహించి వేదిక గౌరవాన్ని పెంచి సంగీత సాహిత్యాలకు వేదికగా నిలిచాయి.

కనుమరుగవుతున్న కార్యక్రమాలు..

సంగీత కళాశాల నిర్వాహకులు ఇదే కళాశాల ప్రాంగణంలో ఉన్న భాషా సాంస్కృతిక శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల కళాశాల పరిసరాల్లో భారీగా పిచ్చిమొక్కలు పెరిగాయి. స్థానికులు, కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రుల మొర అరణ్యరోదనగానే మిగిలిపోయింది. గతంలో కొందరు స్థానికులు కళాశాలలో శబ్దకాలుష్యం వస్తోందని కోర్టును ఆశ్రయించారు. కళాశాల పాలక వర్గం సరైన సమయంలో స్పందించక పోవడం, కోర్టులకు హాజరు కాకపోవడంతో జిల్లా కోర్టు కళాశాలలోని వేదిక వెనుక వైపు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేసింది. కళాశాల నిర్వాహకులు స్పందించకపోవడంతోనే ఇటువంటి పరిస్థితి వచ్చిందని కళాకారులు, సంగీత విద్వాంసులు ఆవేదన చెందుతున్నారు. సలహాలు, సూచనల కోసం ఏర్పాటు చేయపడిన ఫిర్యాదుల పెట్టె నిరుపయోగంగా మారింది. 20 ఏళ్లుగా పెట్టె తెరచిన దాఖలాలు లేవు. నూతన కళాశాల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలని కళాకారులు, విద్వాంసులు కోరుతున్నారు.

నూతన కళావేదికను నిర్మించాలి..

ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ కళాశాలకు అనుబంధంగా ప్రభుత్వం వెంటనే ఇండోర్ స్టేడియం నిర్మాణం చేయాలి. వేదిక మీద కళా ప్రదర్శనలకు కోర్టు నుంచి అనుమతి తెచ్చుకోవాలని కళాకారులు కోరుతున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న కళావేదిక ప్రాంగణం



అలంకారప్రాయంగా ఫిర్యాదుల బాక్స్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలని బాపులపాడు తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపీడీవో రత్నకుమారి ఆదేశించారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలు మొదలు కావటంతో డయేరియా, మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు అధికంగా వ్యాధి చెందే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని, తాగునీరు క్లోరినేషన్ చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష, ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షకీల్ అహ్మద్, సీహెచ్‌వో ఫణికుమార్ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

గన్నవరం రూరల్: ఇళ్లల్లో నీరు నిల్వ ఉండే పాత్రలు లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో ఉండే ఫ్రిజ్‌లు, పాత తొట్టెలు, టైర్లు, మురికి గోతులు దోమలకు నిలయాలుగా ఉంటాయని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దోమల వల్ల వ్యాప్తి చెందుతాయని, వాటిని నివారించేందుకు దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. ఆహార పదార్థాలు వేడిగా ఉండాలని తెలిపారు. నిల్వ ఉన్న ఆహారం తినరాదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాలు కాపాడుకోవాలని వివరించారు.

పిచ్చి మొక్కల నివారణకు చర్యలు

గన్నవరం రూరల్: గ్రామంలో రోడ్ల వెంట పిచ్చి మొక్కలు, చెత్త నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డ్రైడేలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలు నివారణకు మందులు స్ప్రే చేయిస్తున్నామని వివరించారు.